క్లుప్తంగా

సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ



పొదలకూరు: డిగ్రీ ద్వితీయ సంవత్సర నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో పట్టణంలో విద్యానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్వీబీవీడీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బీకామ్‌లో ప్రశాంతి 9.19.. బీసీఏలో వినయ్ 9.23, అపర్ణ 9.08, అనిత 9.2 గ్రేడ్లను సాధించారు. వీరిని విద్యాసంస్థల చైర్మన్ వెంకటేశ్వర్లు, ఎండీ నరేంద్రరెడ్డి అభినందించారు.

మెగా వైద్య శిబిరం



పొదలకూరు: మండలంలోని అంకుపల్లిలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆంధ్రా విద్యార్థి సంఘ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. నేత్ర, గుండె, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులున్న రోగులకు పరీక్షలను ఎల్వీ ప్రసాద్, మెడికవర్ ఆస్పత్రుల వైద్యులు జరిపారు. నేత్ర ఆపరేషన్లను ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి ద్వారా ఉచితంగా చేయిస్తామని మేనేజర్ వెంకట్రావ్ పేర్కొన్నారు. రోగులకు మందులను అందజేశారు. సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్, మెడికవర్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి భాను తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గ్రామోత్సవం



పొదలకూరు: కృష్ణాష్టమిని పురస్కరించుకొని మండలంలోని నావూరులో గ్రామోత్సవాన్ని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక, పొదలకూరు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మండల కమిటీ అధ్యక్షుడు పెంచలనర్సయ్య, సభ్యులు కృష్ణయ్య, కొండయ్య, నర్సారెడ్డి, కల్పన, భాగ్యమ్మ, పెంచలస్వామి, పద్మమ్మ, మధు, కిశోర్, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

రోనాల్డ్ రాస్‌కు నివాళి



పొదలకూరు: మలేరియా వ్యాధికి కారణమైన దోమను కనుగొన్న రోనాల్డ్ రాస్‌కు మహ్మదాపురం పీహెచ్‌సీలో డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు.

కుమారుడి అదృశ్యంపై ఫిర్యాదు

నెల్లూరు సిటీ: ఈనెల 11వ తేదీ నుంచి తన కుమారుడు కనిపించడం లేదని తండ్రి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని చాణక్యపురి కాలనీలో షేక్.మస్తాన్ కుటుంబసభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. అతని పెద్ద కుమారుడు అబ్బు తయాబ్ ఇంటర్ చదువును మధ్యలోనే ఆపేశారు. ఖాళీగా ఇంట్లోనే ఉంటున్నారు. ఆత్మకూరుకు చెందిన దుర్గాభవానీ అనే మహిళతో కొంత కాలం క్రితం ఇన్‌స్టాగామ్‌లో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో 11న అబ్బు తయాబ్ ఇంటి నుంచి చిన్న పని ఉందని వెళ్లారు. తరువాత ఇంటికి తిరిగి రాకపోవడంతో పలు ప్రాంతాల్లో గాలించారు. స్నేహితులు, కుటుంబ సభ్యులకు ఫోన్లు చేసి ఆరా తీసినా సమాచారం లేకపోవడంతో తండ్రి వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసి గాయపరిచారు

• భర్త ఫిర్యాదు

నెల్లూరు సిటీ: తనపై భార్య, వారి కుటుంబ సభ్యులు కలిసి దాడి చేసి, గాయపరిచారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. చంద్రమౌళీనగర్‌లోని ఒకటో వీధిలో నివాసం ఉంటున్న ఆత్మకూరు కొండయ్య బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య సబిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ఈనెల 10వ తేదీన కొండయ్య డైకస్‌రోడ్డులో సెల్‌ఫోన్ మరమ్మతులు చేయించుకుని ఇంటికి తిరిగి వచ్చారు. ఈ క్రమంలో భార్య సబిత ఎక్కడికి వెళ్లావంటూ భర్తను నిలదీయడంతో ఇరువురి మధ్య మరోసారి తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. సబిత తన తల్లి లక్ష్మమ్మ, తమ్ముడు సతీష్‌కు ఫోన్ చేసి పిలిపించింది. వారు ముగ్గురు కలిసి తనపై కాళ్లతో తన్ని దాడి చేశారు. దీంతో జీజీహెచ్ హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం అడ్మిట్ అయ్యారు. కోలుకున్న తర్వాత బాధితుడు బుధవారం వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనుల బతుకులు మారేదెప్పటికో..?



కాలువల మధ్య ఉన్న గిరిజన కాలనీ



పూరి గుడిసె



కాలువ గట్టును ఆనుకొని ఉన్న నివాసాలు

- రెండు కాలువల మధ్య కట్టపై నివాసాలు
- క్షణక్షణం భయం.. భయం
- పట్టించుకోని పాలకులు

తోటపల్లిగూడూరు: గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని పాలకులు తరచూ చెప్తున్నా, వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంటోంది. నరుకూరు కాలువకట్టపై జీవిస్తున్న గిరిజనులు అనుభవిస్తున్న దుస్థితే దీనికో ఉదాహరణ. మండలంలోని నరుకూరు సమీపంలో మాచర్లవారిపాళెం, కోడూరు కాలువల మధ్య ఉన్న కట్టపై 90 నివాసాల్లో 425 మంది గిరిజనులు నివసిస్తున్నారు. ఇందులో సగం నివాసాలు నరుకూరు, మిగిలిన సగం గుడిపల్లిపాడు పంచాయతీల కిందికొస్తాయి. సుమారు 50 ఏళ్లగా వీరు ఇక్కడి పూరి గుడిసెల్లో నివాసం ఉంటున్నారు.

మౌలిక వసతులు కరువు

వెలగని వీధి దీపాలు.. తాగునీటికి కటకట.. అరొకరగా నీటిని అందించే బోరు.. మౌలిక వసతుల లేమి వీరిని పట్టిపీడిస్తున్నాయి. నివాసాలన్నీ రెండు కాలువల మధ్య ఉండటంతో కాలనీలోని చిన్నారులు ఆడుకునే క్రమంలో అందులో పడి మృత్యువాత పడిన ఉదంతాలూ ఉన్నాయి. చీకటి పడితే విషసర్పాలు సంచరిస్తుండటంతో వీరు ఆందోళనకు గురవుతున్నారు. తుఫాన్లు, విపత్తుల సమయంలో ఈ కాలువలు వరదనీటితో పొంగుతూ కాలనీ వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తాయి. పాలకులు ఇప్పటికైనా స్పందించి ఇక్కడ మౌలిక వసతులను కల్పించి, గిరిజనుల సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గిరిజనులపై చిన్నచూపు



నరుకూరు కాలువల కట్ట కింద నివసిస్తున్న గిరిజనులు ఎన్నో ఏళ్లగా మౌలిక వసతులకు నోచుకోక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కాలనీలో ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటించిన సమయంలో కల్లబొల్లి కబుర్లే చెప్తున్నారు. గిరిజనులనే కారణంతో చిన్నచూపు చూస్తున్నారు.

– మారుబోయిన రాజా, కార్యదర్శి, సీపీఎం నరుకూరు శాఖ

వరిలో తెగుళ్లను నివారించుకోండి



కమ్మపాళెంలో క్షేత్ర సందర్శన చేస్తున్న అధికారులు

కొడవలూరు: వరిలో నల్లనొక్కు తెగులును నివారించుకోవాలని కోవూరు ఏడీఏ జి.అనిత సూచించారు. మండలంలోని కమ్మపాళెం, పెయ్యలపాళెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిని నల్లనొక్కు ఆశించి ఉన్నందున వెంటనే నివారించుకోవాలన్నారు. లేనిపక్షంలో గింజ నల్లగా మారి మార్కెట్‌లో ధర లభించక నష్టపోవాల్సి ఉంటుందన్నారు. నల్లనొక్కు నివారణకు ప్రాపికొనజోల్ 1.5 ఎంఎల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా నివారించుకోవాలని సూచించారు. కౌలు రైతులు విధిగా సీసీఆర్ కార్డులు చేయించుకోవాలన్నారు. అప్పుడే అన్నదాత సుఖీభవ పథకం వస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలకు పంట నమోదు అనివార్యమైనందున వరిసాగు చేస్తున్న ప్రతి రైతు విధిగా వీఏఏను సంప్రదించి పంట నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ ఎస్.విజయలక్ష్మి, వీఏఏలు నిహారిక, సుజిత్, రైతులు పాల్గొన్నారు.

కాకాణిని కలిసిన నేతలు



తోటపల్లిగూడూరు: జిల్లా కేంద్ర కారాగారం నుంచి విడుదలైన మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మండల నేతలు బుధవారం కలిశారు. సెంట్రల్ జైలు వద్దకు ఉదయమే వీరు చేరుకున్నారు. జై కాకాణి అనే నినాదాలతో హోరెత్తించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, నేతలు ఇసనాక రమేష్‌రెడ్డి, తలమంచి సురేంద్రబాబు, చెరుకూరు శ్రీనివాసులునాయుడు, తిరవళ్లూరు ఈశ్వరయ్య, ఈదూరు రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ తొలగించారని ఆందోళన



ఎంపీడీఓ కార్యాయలం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు పలువురు దివ్యాంగులు తమకు పింఛన్ తొలగిస్తున్నట్లు నోటీసులు అందాయని బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకారణంగా తమకు నోటీసులు అందజేయడం సరికాదన్నారు. ఎలాంటి కారణం లేకుండా తమకు పింఛన్ తొలగిస్తున్నట్లు నోటీసులు అందాయని వాపోయారు. బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌లో 35 మందికి, పట్టణంలో 18 మందికి నోటీసులు అందించారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తమకు ఎలాంటి షరతులు లేకుండా పింఛన్ అందిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అకారణంగా పింఛన్లు తొలగించడం సరికాదని వారు పేర్కొన్నారు. ఈ విషయమై ఎంపీడీఓ నారాయణరెడ్డిని వివరణ కోరగా ప్రభుత్వాదేశాల మేరకు నోటీసులు అందజేశామని, వారు తమ అంగవైకల్యాన్ని నిరూపించుకున్న తర్వాత పింఛన్ను పునరుద్ధరిస్తామని తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై బహిరంగ విచారణ



విచారణ జరుపుతున్న విజయలక్ష్మి

పొదలకూరు: పొదలకూరు పంచాయతీ పరిధిలోని తెలుగుగంగ పునరావాస కేంద్రం (వెంకటేశ్వరనగర్) అంగన్‌వాడీ కార్యకర్త సునీతపై బహిరంగ విచారణను వెంకటాచలం సీడీపీఓ విజయలక్ష్మి బుధవారం చేపట్టారు. పిల్లలకు అందజేయాల్సిన బాలామృతం, కోడిగుడ్లు, ఇతర సరుకులను అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఆటోలో మంగళవారం రాత్రి తరలిస్తూ గ్రామస్తులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీడీపీఓకు ఫిర్యాదు చేశారు. దీంతో అంగన్‌వాడీ టీచర్‌పై బహిరంగ విచారణను నిర్వహించారు. కోడిగుడ్లు, బాలామృతం, ఇతర సామగ్రిని సక్రమంగా అందజేస్తున్నారానే అంశాన్ని పిల్లల తల్లులను ఆరాతీశారు. 15 కోడిగుడ్లనే అందజేసి, 25 ఇచ్చినట్లుగా సంతకాలు తీసుకుంటున్నారని విచారణలో వెల్లడించారు. కార్యకర్త పనితీరుపై గ్రామస్తులు సైతం ధ్వజమెత్తారు. సరుకులను ఆటోలో తరలిస్తుండగా తాము పక్కా సమాచారంతో పట్టుకున్నామని వెల్లడించారు. అంగన్‌వాడీ కార్యకర్త అవకతవకలకు పాల్పడ్డారనే అంశం ప్రాథమికంగా తేలిందని విచారణ అనంతరం సీడీపీఓ తెలిపారు. దీనిపై సమగ్ర నివేదికను రూపొందించి పీడీకి అందజేయనున్నామని చెప్పారు. సూపర్‌వైజర్లు ఆదినారాయణమ్మ, జ్యోతిలక్ష్మి పాల్గొన్నారు.

మాతమ్మ గుడి జీర్ణోద్ధరణ ప్రారంభం



మనుబోలు: మనుబోలు అరుంధతీయవాడలోని మాతమ్మ దేవాలయ జీర్ణోద్ధరణ కార్యక్రమాలను భువనేశ్వరి మాత పీఠాధిపతి కమలానందభారతి ఆధ్వర్యంలో వేద పండితుడు సాయిశర్మ పర్యవేక్షణలో బుధవారం ప్రారంభించారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయాన్ని తొలగించేందుకు ఉద్వాసన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. తొలుత గోదా దర్శనం, మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ పూజ, కలశ ప్రతిష్ఠ చేశారు. ఆలయంలో ముఖ్యమైన భాగాలను తొలగించి బాలాలయంలో నిక్షిప్తం చేశారు. ఆలయ శంకుస్థాపనను త్వరలోనే చేపట్టనున్నామని అర్చకుడు సాయిశర్మ తెలిపారు.

ఉపాధ్యాయుడికి పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రపంచ మానవతా దినోత్సవం సందర్భంగా బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, సామాజికవేత్త గండికోట సుధీర్‌కుమార్ మంగళవారం మానవతామూర్తి పురస్కారం అందుకున్నారు. నెల్లూరు నగరంలోని పుర మందిరంలో సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మి లక్ష్మయ్య నాయుడు తదితరుల చేతుల మీదుగా గండికోటకు పురస్కారం అందజేసి అభినందించారు. ఈ క్రమంలో ఆయనకు ఎంఈఓలు దిలీప్‌కుమార్, రత్నం, సహచర ఉపాధ్యాయులు బుధవారం అభినందనలు తెలిపారు.

హుండీ కానుకల లెక్కింపు

వెంకటాచలం: మండలంలోని కసుమూరు దర్గాలో హుండీ కానుకల లెక్కింపును బుధవారం ప్రారంభించారు. మూడు రోజుల పాటు ప్రక్రియ జరగనుందని, అనంతరం వివరాలను వెల్లడించనున్నామని దర్గా కేర్ టేకర్ అస్లామ్ తెలిపారు.

వీఏఏలకు శిక్షణ నేడు

పొదలకూరు: పొదలకూరు సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల వీఏఏలు, వీహెచ్ఏలకు స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానంలో శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఉదయం పదికి నిర్వహించనున్నామని ఏడీఏ శివనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తప్పక హాజరుకావాలని కోరారు.

వెంకయ్యస్వామికి హనుమంతసేవ



వెంకటాచలం: ఆరాధనోత్సవాలను పురస్కరించుకొని గొలగమూడిలోని వెంకయ్యస్వామికి హనుమంత వాహనసేవను బుధవారం నిర్వహించారు. పూజల అనంతరం వెంకయ్యస్వామిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం ఘనంగా జరిగింది. భక్తులు వీక్షించి.. కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అర్చకులు అందజేశారు. ఆశ్రమ నిత్యాన్నదానశాలలో అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా ఇందుకూరుపేటకు చెందిన సూదలగుంట నాగార్జునరావు, ప్రేమలత దంపతులు వ్యవహరించారు.

• హంసవాహనసేవ నేత్రపర్వంగా సాగింది. ఉభయకర్తలుగా మోచర్ల మధు, ఉప్పల మోహన్, నల్లగుండ్ల గాంధీ వ్యవహరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఉత్సవాల్లో నేడు

వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా చినశేష, గజవాహనసేవలను గురువారం నిర్వహించనున్నారు.

‘అక్షర ఆంధ్ర’ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నారాయణరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నిరక్షరాస్యుల జీవితాల్లో వెలుగులు నింపడానికి అక్షర ఆంధ్ర కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.నారాయణరెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో ‘అక్షర ఆంధ్ర’ కార్యక్రమంపై సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం నాలుగు నుంచి ఏడు గంటల వరకు అక్షరాస్యత కేంద్రాలు నిర్వహించాలన్నారు. ప్రతి పది మంది నిరక్షరాస్యులకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. చదవడం, రాయడంతో పాటు, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తారన్నారు. వంద రోజుల పాటు జరిగే కార్యక్రమంలో సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చి దిద్దుతామని తెలిపారు. శిక్షకుడిగా గండికోట సుధీర్ కుమార్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎం.దిలీప్‌కుమార్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో అనేక వ్యాధులు దూరం



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఉమామహేశ్వరి

కొడవలూరు: పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక వ్యాధులను పారదోలుదామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి సూచించారు. మండలంలోని యల్లాయపాళెం తేళ్లమిట్ట గిరిజన కాలనీలో సామాజిక పండగ(సీబీ ఈవెంట్) కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా అనేక రకాల వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమల ఉత్పత్తికి దోహదపడే ఆవాసాలను తొలగించుకోవడంతో పాటు దోమలు కుట్టకుండా రాత్రిళ్లు దోమతెరలు విధిగా వాడుకోవాలని సూచించారు. అనంతరం చేతులను శుభ్రపరచుకోవడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం మహేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మి పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న సీడీపీఓ శారద

కోవూరు: చిన్నారుల భవిష్యత్తు బాగుండాలంటే విద్య, పోషణ, ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రతపై సమానమైన శ్రద్ధ అవసరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శారద అన్నారు. కోవూరు ప్రాజెక్టు కార్యాలయంలో కోవూరు, కొడవలూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీ ఆయాలతో బుధవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత, విద్యా సదుపాయాల్లో ఎలాంటి లోపం ఉండకూడదన్నారు. పిల్లలు ఎప్పుడూ ఆరోగ్యంగా, చురుగ్గా ఉండేలా ఆహారం అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య పెంచాలని, ఇందుకు తల్లిదండ్రులు, గ్రామ పెద్దలతో క్రమం తప్పకుండా సంప్రదింపులు జరిపి చిన్నారులను తీసుకురావాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లు క్రమం తప్పకుండా తనిఖీలు చేస్తూ, లోపాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉమా, సుమిత్ర, నాగభూషణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దోమలపై అప్రమత్తత అవసరం

• జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హుస్సేనమ్మ

కొడవలూరు: దోమల పట్ల అప్రమత్తత అవసరమని జిల్లా మలేరియా నివారణాధికారిణి ఇ.హుస్సేనమ్మ సూచించారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని చంద్రశేఖరపురం ఏకలవ్య గిరిజన గురుకులంలో సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ ఎనాఫిలస్ దోమ వల్ల మలేరియా వ్యాధి వస్తుందని సర్ రోనాల్డ్ రాస్ గుర్తించారన్నారు. మలేరియా వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు మలేరియాపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తొలుత మలేరియా వ్యాధి కారక దోమల నివారణపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రీతమ్ బిశ్వాస్, వైద్యాధికారి ఎం.రామకృష్ణ, సహాయ మలేరియా నివారణాధికారి వి.నాగార్జునరావు, సీహెచ్ఓ టి.సోమశేఖరరావు, ఎస్‌యూఓ నాగరాజు, హెచ్ఏ ఒ.సుధాకర్, ఏఎన్ఎం టి.రాధమ్మలు పాల్గొన్నారు.

ప్రాణహాని ఉంది.. రక్షించండి

నెల్లూరు రూరల్: తన భర్త పాశం అఖిల్‌కు తమ బంధువుల నుంచి ప్రాణహాని ఉందని కందుకూరుకు చెందిన కలిశెట్టి భవ్య తెలిపారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో వారు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మేము మేజర్లమని, ఆరేళ్లు ప్రేమించుకుని గత జూలై 23న ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నామని తెలిపారు. మా తల్లిదండ్రులు కందుకూరులో మిస్సింగ్ కేసు ఫైల్ చేశారన్నారు. వివాహమైన మరుసటి రోజు ఎస్పీని కలిసి విన్నవించామన్నారు. ఎస్పీ కూడా సానుకూలంగా స్పందించి కావలి డీఎస్పీకి నివేదించారన్నారు. డీఎస్పీ సమక్షంలో మాకు హాని చేయమని బంధువులతో సంతకాలు కూడా చేశారన్నారు. కానీ ఇప్పుడు బంధువులందరూ దూషిస్తూ నీ భర్తను చంపేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. రాజకీయంగా కూడా బలం చూపిస్తూ రౌడీలతో ఫోన్లు చేయించి బెదిరిస్తున్నారన్నారు. డీఎస్పీ రెండు సార్లు కౌన్సెలింగ్ ఇచ్చినా వారిలో మార్పు రాలేదని, దయచేసి మాకు రక్షణ కల్పించాలని కోరారు.

అభిమాన ఝురి

కూటమి ప్రభుత్వం మోపిన అక్రమ కేసులతో జిల్లా కేంద్ర కారాగారంలో ఉన్న మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం విడుదలయ్యారు. తమ అభిమాన నేతను చూసి పలకరించేందుకు సర్వేపల్లి నియోజకవర్గం నుంచే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. జై కాకాణి అనే నినాదాలతో హోరెత్తించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



కుమార్తెను హత్తుకొని భావోద్వేగానికి లోనై..



అభివాదం చేస్తూ..



జైలు నుంచి బయటకొస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి



జైలు వద్ద నిరీక్షిస్తున్న ఆనం అరుణమ్మ, మేరిగ మురళి తదితరులు